### సీనియర్ అడ్వకేట్ హోదా

సుప్రీంకోర్టు ఒకే రోజు 11 మంది మహిళా న్యాయవాదులకు సీనియర్ అడ్వకేట్ హోదాను కల్పించి రికార్డు సృష్టించింది. 75 ఏండ్లలో కేవలం 12 మంది మహిళా న్యాయవాదులకు మాత్రమే సీనియర్ అడ్వకేట్ హోదాను సుప్రీంకోర్టు కల్పించింది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జనవరి 19న మొత్తం 56 మందికి సీనియర్ అడ్వకేట్ హోదాను కల్పించగా.. వారిలో 11 మంది మహిళా న్యాయవాదులు ఉన్నారు. 2019లో ఆరుగురు మహిళా న్యాయవాదులకు సీనియర్ అడ్వకేట్ హోదా లభించింది. సీనియర్ అడ్వకేట్ హోదా లభించిన వారిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ పోతరాజు ఉన్నారు.

# విశ్లేషణాత్మకంగా చదువు.. విజేతగా నిలువు

**గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రిపరేషన్**



అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 563 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగం సాధించాలంటే ప్రిలిమినరీ పాసై, మెయిన్స్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించాలి. కాబట్టి ప్రిలిమినరీని తేలికగా తీసుకోవద్దు. పరీక్ష స్థాయి పెరిగి సివిల్స్ తరహాలో విశ్లేషణాత్మక ప్రశ్నలు ఉండటం, రద్దయిన పాత నోటిఫికేషన్ అభ్యర్థులతో పాటు వయోపరిమితి సడలింపు వల్ల కొత్తగా అవకాశం పొందిన సీనియర్ అభ్యర్థులు, ఇటీవల డిగ్రీ పూర్తయిన కొత్త అభ్యర్థులు, సివిల్స్ అభ్యర్థులు వెరసి భారీ స్థాయిలో ఈ నోటిఫకేషన్‌కు పోటీ పడనున్నారు. దీంతో 1:50 చొప్పున ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేసినా, పోటీ దృష్ట్యా కటాఫ్ మార్కులు భారీగానే ఉండవచ్చు. ఈ క్రమంలో ప్రిలిమ్స్‌లో భారీ స్కోర్ సాధించాలి. కాబట్టి ప్రిపరేషన్ స్థాయిలను పెంచడం, తరచూ ప్రాక్టీస్ టెస్టులు రాయడం వల్ల విజయానికి చేరుకోవచ్చు.

- ప్రిలిమ్స్‌లో ఉన్న మొత్తం 13 విభాగాల్లోని అన్ని అంశాలు దాదాపు మెయిన్స్ సిలబస్‌లో కూడా ఉండటంతో ప్రిలిమ్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు ఏక కాలంలో మెయిన్స్‌కు కూడా విశ్లేషణాత్మకంగా చదువుతూ ఇంటిగ్రేటెడ్ ప్రిపరేషన్ చేయాలి. దీనివల్ల విషయావగాహన పెరుగుతుంది. సమయం కలిసి వస్తుంది. పైగా ఇటీవల ప్రిలిమ్స్ ప్రశ్నలు నేరుగా ఒక సమాధానం గుర్తించే విధంగా కాకుండా విశ్లేషణాత్మకంగా బహుళ ఐచ్ఛికాల (మల్టిపుల్ ఆన్సర్ చాయిస్‌ల) నుంచి సమాధానం గుర్తించే విధంగా ఉంటున్నాయి. కాబట్టి సంపూర్ణ విషయావగాహన విధానంలోనే ప్రిపరేషన్ ఉండాలి. బిట్ల రూపంలో సబ్జెక్టులను చదవకూడదు. **దృష్టి కేంద్రీకరించాల్సిన సిలబస్ అంశాలు..**

### 1) ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు

- పరీక్షకు ఏడాది ముందు వరకు జరిగిన సమకాలీన అంశాలన్నింటిపైనా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా పరీక్షకు ముందు ఆరునెలల కాలంలో జరిగిన అన్ని రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ వర్తమాన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.
- ఐక్యరాజ్యసమితికి చెందిన సంస్థలు, నీతి ఆయోగ్, వరల్డ్ బ్యాంక్, నేషనల్ క్రైమ్ బ్యూరో వంటి వివిధ జాతీయ, అతర్జాతీయ సంస్థలు వెలువరించిన నివేదికలు, సూచీలు చదవాలి.
- వివిధ పురస్కారాలు, పదవుల్లోని వ్యక్తులు, సదస్సులు, ఒప్పందాలు, తీర్మానాలు, క్రీడలు, ప్రముఖ పర్యటనలు వంటి అంశాలను అధ్యయనం చేయాలి.
- వరల్డ్ హాపీనెస్ ఇండెక్స్, నోబెల్, ఆస్కార్, జాతీయ చలన చిత్ర అవార్డులు, పద్మ పురస్కారాల నుంచి ప్రశ్నలు లేకుండా ప్రశ్నపత్రం ఉండదు. కాబట్టి ఈ అంశాలపై లోతైన అవగాహన అవసరం.
- ఇటీవల ప్రకటించిన భారతరత్న అవార్డులు, పార్లమెంట్ నూతన భవన నిర్మాణ విశేషాలు, ప్రధాని విదేశీ పర్యటనల సందర్భంగా సదస్సులు విశేషాలు, వివిధ సైనిక విన్యాసాలు వంటి జాతీయ అంశాల పరంగా ప్రశ్నలు రావచ్చు. ఆస్కార్ అవార్డులు, కాప్-28 సమావేశాలు వంటివి అంతర్జాతీయ అంశాలుగా గమనించాలి. రాష్ట్రీయంగా నంది అవార్డుల స్థానంలో 'గద్దర్' అవార్డును ప్రవేశ పెట్టడం, జాతీయ స్థాయిలో రాష్ట్రానికి చెందిన గ్రామపంచాయతీలు, వివిధ శాఖలకు లభించిన పురస్కారాలపై శ్రద్ధ వహించాలి.
- వీటి కోసం నిత్యం దినపత్రికలను చదువుతూ నోట్స్ తయారు చేసుకోవాలి. ఈ వర్తమాన అంశాల్లో భాగంగా సేకరించిన వివిధ నివేదికలు, సర్వేల దత్తాంశాలు, ఇండెక్స్‌లను, సమావేశ తీర్మానాలు, సదస్సుల ఎజెండాలు వంటి సమాచారాలను డిస్క్రిప్టివ్ ఆన్సర్ రైటింగ్‌లో సందర్భానుసారం వినియోగించుకుంటే మెయిన్స్‌కు కూడా ఉపయోగపడుతుంది.

### 2) అంతర్జాతీయ సంబంధాలు, సంఘటనలు

- భారత్‌తో సంబంధం ఉన్న అంతర్జాతీయ పరిణామాలు, వివాదాలను ప్రత్యేక దృష్టితో పరిశీలించాలి. ఉదా: భారత్-మాల్దీవుల మధ్య సంబంధాల్లో ఒడిదొడుకులు, భారత్-ఫ్రాన్స్ మధ్య బలపడుతున్న బంధం, వివిధ దేశాలతో భారత్ చేసుకుంటున్న ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలు, వివిధ అంతర్జాతీయ అంశాలపై భారత్ స్పందన వంటి అంశాలను కూడా గమనించాలి.
- భారత్‌తో ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా పరోక్ష ప్రభావాన్ని చూపుతున్న ఇజ్రాయెల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్, చైనా-తైవాన్ మధ్య రగులుతున్న వివాదాలు, ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిణామాలు, ఎన్నికలు, వివిధ సంఘటనలను గమనించాలి. గత ప్రిలిమ్స్ ప్రశ్నపత్రంలో చైనా టిబెట్ ఆక్రమణపై భారత్ నిరసన లేఖకు సంబంధించి ప్రశ్న రావడం, అమెరికా-రష్యా మధ్య యుద్ధ వాతావరణానికి దారితీసిన అంశం ఏది అనే ప్రశ్న రావడం ఈ కోవలోనివే.
- గ్లోబల్ ఫ్యూయల్ అలయన్స్, ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్, ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్, అరబ్ దేశాల్లో సంస్కరణలు, ఆంక్షల సడలింపులు, నాగొర్నో-కరబఖ్ వంటి అంశాలను కూడా ప్రత్యేకంగా గమనించాలి.
- లిథియం నిల్వలు, తవ్వక ఒప్పందాలు, ఇంధన సంబంధిత వార్తల్లోని అంశాలు, ఆయుధ ఒప్పందాలపై కూడా దృష్టి పెట్టాలి.

### 3) జనరల్ సైన్స్: సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో భారత్ విజయాలు

- ఈ విభాగంలో జనరల్ సైన్స్‌కు సంబంధించి రసాయన, భౌతిక, జీవశాస్త్రాల పరంగా అనువర్తిత అంశాలపై తరచూ ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు వివిధ వ్యాధుల కారకాలు, శరీర నిర్మాణం, అవయవాల విధులు, విటమిన్లు, నిత్య జీవితంలో వినియోగించే రసాయనాలు, యంత్ర పరికరాల శాస్త్రీయతా అంశాలపై ప్రశ్నలను గత ప్రశ్నపత్రాల్లో చూడవచ్చు.
- ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాల అధ్యయనం ద్వారా (ఆరో తరగతి నుంచి 10 వరకు టెక్స్ట్‌బుక్స్) పై అంశాలపై అవగాహన పొందవచ్చు.
- అదేవిధంగా భారత అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలు, ఇస్రో ప్రయోగాలు, వాహక నౌకలు, ఉపగ్రహాలు, వాటి నిర్మాణ విశేషాలపై ప్రశ్నలు లేకుండా గత ఏ ప్రశ్నాపత్రం లేదు.
- చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1, గగన్‌యాన్‌లను ఈసారి మరింత విపులంగా అధ్యయనం చేయాలి. డీఆర్‌డీవో, ఐఐటీలు, సీఎస్‌ఐఆర్, సీసీఎంబీ, ఐఐఎస్సీ వంటి సంస్థల ప్రఖ్యాత పరిశోధనలు, ఆవిష్కరణలపై, వివిధ ప్రైవేటు సంస్థలతో జరిగిన భాగస్వామ్య ఒప్పందాలపై దృష్టి సారించాలి.
- ఉదాహరణకు తాజాగా రిలయన్స్ సంస్థ, వివిధ ఐఐటీల భాగస్వామ్యంతో చాట్‌జీపీటీ వంటి దేశీయ కృత్రిమ మేధ అనువర్తన అయిన 'భారత్‌జీపీటీ ఎకోసిస్టమ్ (హనుమాన్)ను అభివృద్ధి చేయడం మొదలైన అంశాలను గుర్తించి చదవాలి.
- అదేవిధంగా కంప్యూటర్ సంబంధిత ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. టీకాల అభివృద్ధి, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన టెక్నాలజీ వాహనాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనువర్తనాల వంటి ఇతరత్రా శాస్త్ర సాంకేతిక అంశాల్లో భారత్ విజయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

### 4) పర్యావరణ సంబంధిత అంశాలు: విపత్తు నిర్వహణ, నిరోధం, ఉపశమన వ్యూహాలు

- ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ క్షీణత, అంతరించిపోతున్న జాతులు, హరితగృహ ప్రభావం, ఉష్ణోగ్రతల పెరుగుదల, ఉద్గారాలపై నివేదికలు-సదస్సులు-తీర్మానాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- దేశంలో అరుదుగా కనిపిస్తున్న జీవాలు, అంతరించిపోతున్న జాతుల వివరాలు, కొత్తగా కనుగొన్న జీవజాతులు వంటి అంశాలను పరిశీలించాలి.
- అంతేకాకుండా దేశీయంగా, అంతర్జాతీయంగా ఇటీవల సంభవించిన విపత్తులు, వాటి కారణాలు, నివారణా విధానాలపై అవగాహన ఉండాలి. ముఖ్యంగా హిమాలయ ప్రాంత దుర్ఘటనలు, అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల ఏర్పడుతున్న విపత్తులను చదవాలి. ఈ విభాగం నుంచి కొంత వరకు స్టాక్ జీకే పరంగా కూడా ప్రశ్నలు వస్తున్నాయి. పర్యావరణ, విపత్తు నిర్వహణకు సంబంధించిన చట్టాలు, సదస్సులు, పరిరక్షణ సంస్థలు, విపత్తు సంఘటనలు, విపత్తు ప్రాధికార మంత్రిత్వ శాఖల వంటి అంశాలపై తరచూ ప్రశ్నలు అడుగుతున్నారని గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అర్థమవుతుంది.
- ఉదాహరణకు మిడతల దండు, కార్చిచ్చు, వడగాలులు, శాశ్వత మంచు కరుగుదల వంటివి ఏయే ప్రాంతాల్లో జరిగాయో జత చేయమని గత ప్రిలిమ్స్‌లో ప్రశ్న వచ్చింది. ప్రపంచ కాలుష్య స్థాయిలపై నివేదికలు, విపత్తు నిర్వహణ, సహకార ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలపై అధ్యయనం చేయాలి.

### 5) భారతదేశ ఆర్థిక సామాజిక అభివృద్ధి

- దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు సాధించిన ఆర్థిక, సామాజిక ప్రగతిని అవగతం చేసుకోవడానికి పంచవర్ష ప్రణాళికలతో పాటు జనాభారీతులు, అక్షరాస్యత, లింగ నిష్పత్తి, ఆరోగ్యం, మాతాశిశు మరణాలు, ఆయుఃప్రమాణ స్థాయిల్లో పెరుగుదల వంటి కొలమానాలను వివిధ కాలాలకు సంబంధించి తులనాత్మకంగా పరిశీలించాలి.
- ఇటీవల ఆర్థిక మంత్రి విడుదల చేసిన శ్వేతపత్రం, తులనాత్మక సామాజిక-ఆర్థిక సర్వే వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.
- పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, సంక్షేమ చర్యలపై అవగాహన ఏర్పరచుకోవాలి. వృద్ధి రేటు తులనాత్మక పరిశీలన అవసరం.
- దేశ ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల వాటా, వాటిలో మార్పులను సైతం తెలుసుకోవాలి.
- వివిధ పంచవర్ష ప్రణాళికల్లో చేపట్టిన పథకాలు, అక్షరాస్యతల్లో మార్పు వంటి అంశాలపై ప్రశ్నలు గత పరీక్షల్లో అడిగారు.

### 6) ప్రపంచ, భారతదేశ, తెలంగాణ భౌగోళిక అంశాలు

- భౌగోళిక అంశాలపై ప్రశ్నలు వర్తమాన అంశాలతో ముడిపడి ఎక్కువగా వస్తున్నాయి. కరెంట్ అఫైర్స్, మ్యాప్ పాయింటింగ్ అనుసంధానతతో ఈ విభాగానికి సన్నద్ధం కావాలి. ఈ నేపథ్యంలో ఎర్రసముద్రం, మెడిటేరియన్ సముద్రం, హిందూమహాసముద్ర ప్రాంతం, చైనా సముద్ర ప్రాంతం పరిసర దేశాలు, జలసంధులు, వార్తల్లో ఉన్న ప్రదేశాలు, సరికొత్త ప్రాజెక్టులు, కారిడార్లను ప్రారంభించిన ప్రాంతాలు కీలకం కానున్నాయి.
- లిథియం వంటి నిక్షేపాలు కనుగొన్న ప్రాంతాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, విపత్తులు, యుద్ధాలు సంభవించిన ప్రదేశాలు, భారత ప్రధాని, రాష్ట్రపతి పర్యటించిన ప్రాంతాలు భౌగోళిక ప్రాధాన్యం సంతరించుకుంటాయి.
- దేశ జనసాంద్రత, పట్టణీకరణ అంశాలు, భౌగోళిక గుర్తింపులు (జీఐ ట్యాగ్స్), యునెస్కో గుర్తింపులు, స్మార్ట్ సిటీస్, నీటిపారుదల ప్రాజెక్టులు, నదులు, అటవీ విస్తీర్ణం, పర్వతాలు, భౌగోళిక స్వరూపాలు, ఖనిజ నిక్షేపాలు, వివిధ నూతన రహదారి అభివృద్ధి ప్రాజెక్టులు, పంటల రీతులు వంటి అంశాలను అధ్యయనం చేయాలి.
- తెలంగాణ భౌగోళిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణలో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో జిల్లాకు గల సరిహద్దు జిల్లాలు/ రాష్ట్రాలపై క్షుణ్ణమైన అవగాహన ఉండాలి.
- రాష్ట్రంలో ప్రవహిస్తున్న నదులు, వాగులు, అతిపెద్ద తటాకాలపై కూడా అధ్యయనం చేయాలి. రాష్ట్రంలోని జాతీయ సంస్థలు, ఇటీవలి నూతన నిర్మాణాలు, అటవీ విస్తీర్ణం, జలవనరులు, ప్రాజెక్టులపై, ఆగ్రో క్లైమాటిక్ జోన్లపై కూడా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- 2022లో జరిగిన ప్రిలిమ్స్‌లో వివిధ నీటి పారుదల ప్రాజెక్టులు అవి ఉన్న ప్రదేశాలను జతపరచమని ప్రశ్న రావడం, తెలంగాణలోని ఏయే జిల్లాలు కర్ణాటకతో సరిహద్దును కలిగి ఉన్నాయన్న ప్రశ్నతో పాటు హైదరాబాద్‌లో జీనోమ్ వ్యాలీ దేనికి సంబంధించినది అనే ప్రశ్నలను మనం ఈ కోవలో గమనించవచ్చు. 2023లో తిరిగి నిర్వహించిన ప్రిలిమ్స్‌లో కూడా ఈ తరహా ప్రశ్నలు గమనించవచ్చు.

**మిగతా 5వ పేజీలో..**

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

